ఆస్తిపన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ నెల 31కి గడువు ముగియనుండడంతో పన్ను చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ కె.రవికుమార్ ఆదేశాల మేరకు ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, అసిస్టెంట్ బిల్ కలెక్టర్లు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని ప్రతిరోజు నిర్దేశించిన ఆస్తిపన్నును వసూలు చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్‌కు గాను రూ.54.6 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ.42 కోట్ల వసూలైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్కిల్ కార్యాలయంలో ఆస్తిపన్ను పరిష్కార వేదికలు నిర్వహించి సంబంధిత సమస్యలను పరిష్కరిస్తున్నారు.

డివిజన్ల వారీగా ..

రాజేంద్రనగర్ సర్కిల్ ఆస్తిపన్ను టార్గెట్ రూ.54.6 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ.42 కోట్లు వసూలైంది. సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్‌లో రూ.11.2 కోట్లు ఉండగా రూ.7.7 కోట్లు వసూలైంది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టార్గెట్ రూ.19.36 కోట్లు ఉండగా రూ. 15.51 కోట్లు వసూలైంది. రాజేంద్రనగర్ డివిజన్ టార్గెట్ రూ.12.75 కోట్లు ఉండగా రూ.8 కోట్లు, అత్తాపూర్ డివిజన్ టార్గెట్ ఆదాయం 12.75 కోట్లు ఉండగా రూ.9.74 కోట్లు వసూలయ్యాయి.

లక్ష్యం పూర్తిచేస్తాం..

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఉన్న లక్ష్యాన్ని పూర్తి చేస్తామని ఉప కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు. ఆస్తి పన్ను వసూలులో అధికారులు, సిబ్బంది ప్రత్యేక ప్రణాళికతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆస్తిపన్నును సకాలంలో చెల్లించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వాటిని సర్కిల్ కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకుని చెల్లించాలన్నారు.



రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం

ఆస్తిపన్ను పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆస్తిపన్ను పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ కోరారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ఆస్తిపన్ను పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీహెచ్ఎంసీ అధికారుల సూచనలు మేరకు ప్రతి శనివారం ఆస్తిపన్ను పరిష్కార వేదికను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఆస్తిపన్నులో చెల్లింపుల్లో సమస్యలున్నా ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఈ నెల చివరి శనివారం వరకు ఈ పరిష్కార వేదిక కొనసాగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ఆస్తిపన్ను పరిష్కార వేదికలో పాల్గొన్న డీసీ రవికుమార్

ప్రభుత్వ స్థలంలో డంపింగ్


ప్రభుత్వ భూమిలో వేసిన వ్యర్థాలు

మణికొండ: ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా ఓ నిర్మాణ సంస్థ డంపింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని కోకాపేటవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట రెవెన్యూ సర్వే నెంబర్ 144లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దాని పక్కనే ఓ నిర్మాణ సంస్థ తమ కార్యకలాపాలను కొనసాగిస్తుంది. బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను ప్రభుత్వ భూమిలోకి పడేయటంతో పక్కనున్న నివాసాల్లో దుమ్ము చేరుతుంది. దాంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇదే విషయాన్ని అటు నిర్మాణ సంస్థ, ఇటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు ప్రభుత్వ భూమిలో డంపింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, లేకుంటే జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు కేబుళ్లు



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విద్యుత్ స్తంభాలకు ఇష్టానుసారంగా కేబుల్ వైర్లను చుట్టుతున్నారు. ఏ స్తంభానికి చూసిన కట్టలు కట్టలుగా దర్శనమిస్తున్నాయి. ఈ కేబుళ్ల కారణంగా అప్పుడప్పుడు విద్యుదాఘాతం సంభవిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్లను తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి కేబుల్ వైర్లను తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య పనులను నిర్వహించే విషయంలో కార్మికులు అలసత్వం వహించరాదని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శనివారం ఉదయం 6 గంటలకు 13వ డివిజన్‌లోని పీరంచెరువు, 14వ డివిజన్‌లోని హర్షహైట్స్, 15వ డివిజన్‌లోని మాధవి నగర్ కాలనీల్లోని పారిశుద్ద పనులను ఆయన పరిశీలించారు.

శ్మశానవాటిక అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి


శ్మశానవాటికలోని పవర్ బోరును పరిశీలిస్తున్న ఆలయ ప్రతినిధులు

గోల్కొండ: సాలర్‌జంగ్ కాలనీ తిరుపల్లి గడ్డలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ కృషి చేస్తున్నారని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఎం.నర్సింహ, సోమారపు జనార్దన్ అన్నారు. శనివారం శ్మశాన వాటిక వద్ద కొత్తగా వేసిన బోరు నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గతవారం ఎమ్మెల్యే చొరవతో శ్మశానవాటికలో నీటి ఎద్దడి తొలగించడానికి పవర్ బోరు వేయడం జరిగింది. ఈ పవర్ బోరు ద్వారా శ్మశానవాటికకు నీటి కొరత ఉండదని వారు అన్నారు. త్వరలోనే నీటి ట్యాంకర్‌తో పాటు ప్లాట్‌ఫామ్ కూడా నిర్మించడం జరుగుతుందన్నారు.

ప్రజలకు అండగా మజ్లిస్


మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయనను పలువురు మజ్లిస్ నాయకులు కలిసి తమతమ ప్రాంతాల్లోని నీటి ఎద్దడి గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తాగునీటి సరఫరాలో ఎటువంటి కోతలు లేవని స్పష్టం చేశారు. కార్వాన్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల వారికి సమప్రాధాన్యం ఇస్తూ నీటి సరఫరా చేస్తుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అవాంతరాలు ఉండడం సహజమేనని అటువంటి సమయాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

హెచ్‌సీయూలో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు

రాయదుర్గం: హెచ్‌సీయూలో భూముల పరిరక్షణ కోసం పోరాటం చేయడానికి జాయింట్ యాక్షన్ కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూలోని స్టూడెంట్స్ యూనియన్, టీచర్స్ అసోసియేషన్, వర్కర్స్ యూనియన్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సమష్టి పోరాటం చేయడానికి జేఏసీని ఏర్పాటు చేసుకున్నట్లు శనివారం ప్రకటించారు. అన్ని రకాలుగా పోరాటాలు చేసి, వినతిపత్రాలు సమర్పించి ఎట్టి పరిస్థితుల్లో భూములను పరిరక్షించాలని ఆయా యూనియన్ల నాయకులు నిర్ణయించారు. ఆయా యూనియన్ల ప్రతినిధులు ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వెంటనే వేలం పాటను నిలిపివేసి హెచ్‌సీయూ భూములను పరిరక్షించే వరకు అన్ని రకాలుగా పోరాటం చేయాలని సమష్టి సమావేశంలో నిర్ణయించారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం


సమావేశంలో మాట్లాతున్న గౌతమ్‌రెడ్డి

మణికొండ: సంవత్సరాల తరబడి నివాసాలకు పక్కనే ఉన్న రెడీమిక్స్ ప్లాంట్‌ను తొలగించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తమ బాధలు తొలగిపోతాయని నివాసితులు గౌతమ్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రావు, జైపాల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా వాసులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ నివాసాలకు ఎదురుగా వాసవి అట్లాంట వారి రెడీమిక్స్ కొనసాగుతుందని, దానిని తొలగించి తమ ఆరోగ్యాలను పరిరక్షించాలని మున్సిపల్, పోలీసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ అధికారులతో మొర పెట్టుకున్న పట్టించుకోలేదన్నారు. చివరకు కోర్టును ఆశ్రయించటంతో వెంటనే మూసివేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ సమావేశంలో నివాసితులు సాయి, ఆదినారాయణ, కవిత, రాధిక, నందన, మనోహర్, నిరంజన్, శ్రీకాంత్, సుబ్బారెడ్డి, నారాయణ, శ్రీధర్, రవి, సమిత్, బీఆర్ఎస్ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్టు నిర్మూలన కార్యక్రమాలు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్ రావు

రాజేంద్రనగర్: ఈ నెల 17వ తేదీ నుంచి 30వ వరకు జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు అన్నారు. శివరాంపల్లిలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆశ కార్యకర్తలు ఉదయం 9 గంటల్లోపు ప్రతి ఇంటికి వెళ్లి లెప్రసీ వ్యాధి లక్షణాల కోసం పరీక్షలు చేసి అనుమానం ఉన్న వారిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ పాపారావు వ్యాధి వ్యాప్తి చెందే విధానం, లక్షణాలు, చికిత్స గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన సర్వే చేసే విధానం, రిపోర్టులు, తయారు చేసే పద్ధతిని వివరించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గోల్కొండ: గోల్కొండ కోటలోని మహంకాళి జగదాంబిక అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారిణి సి.వసంత అన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో అమ్మవారి హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..హుండీ లెక్కింపు ద్వారా అమ్మవారికి రూ.58,626లు ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జగదాంబిక, మహంకాళి అమ్మవార్ల పూజార్లు సర్వేష్, బొమ్మల సురేష్‌చారి, శివశంకర్, లీలావతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భూ పరిరక్షణ పోరుబాటలో పాట హల్‌చల్

రాయదుర్గం: హెచ్‌సీయూలో భూపరిరక్షణ పోరుబాటలో పోరుపాట కలిసి నడుస్తోంది. విద్యార్థుల ఉద్యమానికి ఊపిరిలూదుతోంది. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని భూమిని టీజీఐఐసీ ద్వారా వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్ (బీఎస్ఎఫ్) విద్యార్థి సంఘం పాట ద్వారా పోరాటం చేయాలని శనివారం నిర్ణయించింది. అందుకు మొదటగా 'బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి'పాట తరహాలోనే తనదైన శైలిలో బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం హెచ్‌సీయూ అధ్యక్షుడు ఆరోళ్ల అంజి తనదైన శైలిలో ఓ పాటను రాశారు. 'భూమి మీద భూమి గుంజి... ఎన్నెన్నో భూములు గుంజి...... కేసీఆర్‌ను మించినావురో కాంగిరేసు రేవంత్‌రెడ్డి'అంటూ గీతాన్ని విద్యార్థులు ఆలపిస్తూ, డప్పు కొడుతూ ఆకట్టుకున్నారు. సోమవారం ఈ పాటతోపాటు మరిన్ని పాటలను ఆలపిస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంజి స్పష్టం చేశారు. హెచ్‌సీయూ ప్రహరీ లోపలి భూములను లాక్కొనిచ్చే ప్రసక్తే లేదని అన్నారు. కార్యక్రమంలో పలువురు బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గర్భిణి మృతి

వైద్యుల నిర్లక్ష్యమంటూ బంధువుల ఆరోపణ


మృతి చెందిన ప్రమీల

శంషాబాద్ రూరల్: ఛాతి నొప్పితో ఆస్పత్రికి వెళ్లిన ఓ గర్భిణీ మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం అమీర్‌పేట్ నివాసి బుషమోని ప్రమీల(33) 9 నెలల గర్భిణి. మొదటి నుంచి ముచ్చింతల్ శివారులోని జిమ్స్ ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతుంది. నెలలు నిండడంతో ప్రమీలను ఈ నెల 11న జిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. 13వ తేదీ వరకు ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆమెను వైద్యులు ఇంటికి పంపించారు. 18న ఆస్పత్రికి రావాలంటూ డాక్టర్ పూజిత కొన్ని మందులు రాసిచ్చారు. శుక్రవారం రాత్రి ప్రమీల భోజనం తర్వాత వైద్యులు ఇచ్చిన మందులు వేసుకుంది. కాసేటి తర్వాత ఛాతిలో నొప్పి రావడంతో భర్త సాయిబాబు ఆమెను రాత్రి 10.30 గంటలకు జిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఈ సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో నర్సులు ఆమెను పరిశీలించారు. 12.15 గంటలకు డాక్టర్ రామారావు ఆమెను పరీక్షించగా అప్పటికే చనిపోయింది. సకాలంలో వైద్యం అందక తన భార్య మృతి చెందిందని, ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సాయిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హాఫీజ్‌పేట్ పీహెచ్‌సీలో మెగా వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

చందానగర్: హాఫీజ్‌పేట్ పీహెచ్‌సీలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు చెందిన సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ మంజుల మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని నేపథ్యంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యంపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. హెచ్ఐవీ యాక్టు 2017 గురించి ఎయిడ్స్‌పై, హెపటైటిస్ బీ, సీ గురించి తెలియజేయడం జరిగిందన్నారు. ఈ మెగా క్యాంపులో 135 మందికి పరీక్షలు చేయడం జరిగిందని వైద్యులు తెలిపారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ దివ్య, ల్యాబ్ అసిస్టెంట్ పండరి, పద్మ, ఫార్మసీ మమత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు అపూర్వ అవకాశం


లెక్చరర్లుగా నియామకమైన వారితో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) పూర్వ విద్యార్థులకు అపూర్వ అవకాశం లభించింది. రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీలో లెక్చరర్లుగా ముగ్గురికి అవకాశం లభించింది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా వీరికి అవకాశం వచ్చింది. ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌లో బి.డీఈఎస్ ఫుట్‌వేర్ డిజైన్ కోర్సును 2018–22 బ్యాచ్‌లో పూర్తి చేసిన ముగ్గురు విద్యార్థులకు లెక్చరర్లుగా పనిచేసేందుకు అవకాశం లభించింది. పూర్వ విద్యార్థులు ప్రశాంత్, చంద్రశేఖర్, సూర్యతేజకు టీజీపీఎస్సీ ద్వారా ఈ అవకాశం లభించడం విశేషం. వారు ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నర్సింహులుగారి తేజ్‌లోహిత్ రెడ్డిని శనివవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆ ముగ్గురిని అభినందించారు. చిన్న వయస్సులోనే మంచి అవకాశం వచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫుడ్ కోర్టు కూల్చివేత

గచ్చిబౌలి: అక్రమ నిర్మాణం అంటూ జీహెచ్ఎంసీ అధికారులు ఓ ఫుడ్ కోర్టును కూల్చివేశారు. కొద్ది సంవత్సరాలుగా ఫుడ్ కోర్టు నిర్వహణ చేపడుతుండగా అనుమతి లేని నిర్మాణం అంటూ కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో శేరిలింగంపల్లి సర్కిల్ టైన్ ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చివేశారు. గచ్చిబౌలి డీఎల్ఎఫ్ సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకొని కొద్ది సంవత్సరాలుగా ఏఎం, పీఎం ఫుడ్ కోర్టును నిర్వహిస్తున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఫుడ్ కోర్టును కూల్చివేశారు. ప్రైవేట్ వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో కూల్చివేయాలని ఆదేశాలిచ్చిందని టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు.

కాన్షీరామ్ అడుగుజాడల్లో నడవాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దాత్రి సంక్షేమ సంఘం, దాత్రి కళాంజలిల సంయుక్త ఆధ్వర్యంలో మాజీ మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది టి.రాజు మాట్లాడుతూ..కాన్షీరామ్ ఆశయాల కోసం కృషి చేయాలన్నారు. ఆయన చూపిన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖ నాట్య గురువు రవళి రమేష్ శిష్యబృందం చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ జానపద కళాకారులు జి.మాస్టర్‌జీ, కాంగ్రెస్ నాయకులు దాయానంద్, మల్లా సూర్యప్రకాష్ రావు, చర్లపల్లి జైల్ సూపరింటెండెంట్ జి.రాంచంద్రన్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిలో ఒకేదారి గుండా వాహనాల రాకపోకలు



మేకల మండి రోడ్డుపైనే వాహనాల పార్కింగ్




అభివృద్ధి పనులు పూర్తయ్యేదెన్నడో?

- ఏడాది కాలంగా పూర్తి కాని పైపులైన్, రోడ్డు పనులు
- ఒక్కవైపు నుంచే వాహనాల రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

జియాగూడ: జియాగూడ 100 ఫీట్ల జాతీయ రహదారిలో ఒకవైపు జరుగుతున్న అభివృద్ధి పనులు ఏడాది నుంచి పూర్తికావడం లేదు. దీంతో ప్రయాణికులు ఒక్క రూట్ నుంచే రాకపోకలు కొనసాగిస్తుండగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 100 ఫీట్ల జాతీయ రహదారి పురానాపూల్ నుంచి రాంసింగ్‌పురా వరకు ఉంటుంది. ఈ రహదారిలో గత సంవత్సర కాలం నుంచి పైప్‌లైన్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈ రహదారిలో జియాగూడ మేకల మండి, డంపింగ్‌యార్డు వల్ల కూడా మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ రహదారిలో చెత్తడంపింగ్ యార్డుకు వచ్చే చెత్త ట్రక్కులు గంటల తరబడి నిలిచే ఉంటున్నాయి. అలాగే మేకలమండికి వచ్చే భారీ వాహనాల లోడ్ కూడా రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీంతో కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా ఈ రహదారిలో విద్యుత్ దీపాలు లేకపోవడం కూడా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పైపులైన్, రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి..



జాతీయ రహదారిలోని సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు అనుకూలంగా అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా వీధిదీపాలు, రోడ్లు, డంపిగ్ యార్డ్ పరిసరాల పరిశుభ్రత, మేకలమండి వద్ద వాహనాల నిలిపివేతపై ట్రాఫిక్ విభాగం చర్యలు తీసుకోవాలి. రహదారి కుంచించుకుపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పైప్‌లైన్, రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి.

– వెంకటేశ్ యాదవ్, బీజేపీ జనరల్ సెక్రటరీ